కూలీలందరికీ ఉపాధి పనులు

◆ వలసలను నివారించడమే లక్ష్యం

◆ శ్రీసత్యసాయి జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు

పీడీ రామాంజనేయులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పనులు కల్పించి వలసల నివారించడమే తమ ప్రథమ కర్తవ్యమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రభుత్వం కూలీలకు అనుగుణంగా వారికి ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అందుకోసం శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం ల్యాండ్ లెవలింగ్ పనులు చేపట్టి ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: ఈ సంవత్సరం ఉపాధి కూలీలకు పనులు కల్పించడానికి ఎలాంటి ప్రణాళికలు తీసుకుంటున్నారు.

పీడీ : ఈ ఆర్థిక సంవత్సరంలో శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 54 లక్షల పని దినాలను కల్పించాం. అందుకోసం 1.30 కోట్ల ఖర్చు చేశాం. జిల్లా వ్యాప్తంగా 50 వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరువేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం కార్యక్రమం చేపట్టాం. ఇందుకోసం ఉపాధి పథకం ద్వారా మూడు సంవత్సరాల పండ్ల తోటల పెంపకం కోసం రైతులకు ప్రోత్సాహం ఇస్తున్నా. ఉపాధి పనుల ద్వారా వలసలు నివారిస్తున్నామని 2023-24 ఆర్థిక సంవత్సరంలో కావాల్సిన పనులకు గుర్తింపు కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో జరుపుతున్నాం. జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా నీటి సంరక్షణ పనులు ఉమ్మడి ఆస్తుల పునరుద్ధరణ వ్యక్తిగత పనులను గుర్తించి అంచనాలు తయారు చేసి పరిపాలన అనుమతులు తీసుకుని పనులు కల్పిస్తున్నాం.

ప్రశ్న: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా ఏఏ పనులు జరుగుతున్నాయి.?

పీడీ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం చేపట్టామని జిల్లా వ్యాప్తంగా 6వేల ఎకరాల్లో పండ్ల తోటలను పెంచాలని నిర్ణయించాం. 15 రకాల పండ్ల మొక్కలు రెండు రకాల కూరగాయల పెంపకం కోసం రైతులకు ఉపాధి హామీ ద్వారా అవకాశం ఇస్తున్నాం. ఇప్పటికే రెండు వేల ఎకరాలు పూర్తి అయిందని 15 రోజుల్లోపు 4000 ఎకరాలు పండ్లతోటల పెంపకం పూర్తి అవుతుంది. చెత్తతో సంపద కేంద్రాల నిర్మాణాల పనులు జరుగుతున్నాయని వాటితోపాటు రోడ్లు పనులు కల్పించాం.

ప్ర:నీటి సంరక్షణ కోసం ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

పీడీ:జిల్లా వ్యాప్తంగా వర్షపు నీరు నిల్వ కోసం చెరువులు, కుంటలలో పూడికతీత పనులు చేపట్టాం. మూడు వాటర్ షెడ్లు ఏర్పాటు చేశాం. ధర్మవరం మండలం ఏలుకుంట్ల, ఎన్‌పి.కుంట మండలం మరికొమ్మదిన్నె, పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామాల్లో వాటర్‌షెడ్ పనులు చేపట్టాం. వాటి ద్వారా 50 కోట్ల రూపాయల నిధులతో చెరువులు పూడికతీత పనులు చెక్ డ్యాములు, రాక్ ఫీల్డ్ డ్యాములు, కందకాలు తదితర పనులతో పాటు ప్రభుత్వ భవనాలు, సచివాలయాలు, ఉన్నత పాఠశాలల వద్ద వర్షపు నీరు నిల్వ చేయడానికి ఇంకుడు గుంతలు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 250 నిర్మించాం. వాటికి ఒక్కొక్క దానికి రూ.50 వేల నుండి లక్ష రూపాయల దాకా ఖర్చు చేస్తున్నా.

ప్రశ్న: ఉపాధి హామీ పథకంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అవినీతిపై మీ సమాధానం.

పీడీ : ఉపాధి హామీ కూలీలు బిల్లులు చెల్లింపులు జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద బిల్లులు మంజూరు చేయాల్సి ఉండడంతో ఈ జాప్యం జరుగుతోంది. ఉపాధి కూలీల పనుల విషయంలో అవినీతి జరగడానికి ఆస్కారం లేదు. చాలా చోట్ల అవినీతిపై విచారణలు చేపట్టాం. దానికి తోడు సామాజిక తనిఖీలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నాం. ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా అందులో అవినీతి బయటపడిన వెంటనే రికవరీ చేస్తున్నాం. కొంతమంది గ్రామంలో లేని వారు ఉపాధి బిల్లులు పొందుతున్నారని తమ దష్టికి రావడంతో ఆ గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించా. అందులో ఎలాంటి అవినీతీ జరగలేదు.

జెసి చుట్టూ చక్రబంధం

◆ మొన్న కౌన్సిలర్...నిన్న మైనార్టీ నాయకుడు..

◆ వరుసగా కొనసాగుతున్న రాజీనామాలు

◆ ఆర్థికంగా అయిపోయింది... ఇక రాజకీయంగా చెక్ పెడుతున్నారా.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు త్వరలో రానున్నాయి. ఈ ఎన్నికలకు ముందే తాడిపత్రిలో రాజకీయం జోరుగా మొదలైనట్టు కనిపిస్తోంది. జెసి కుటుంబం చుట్టూ చక్రబంధాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాలు సాగుతున్నట్టు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఆర్థికపరమైన అంశాలపై దెబ్బపడిన విషయం తెలిసిందే. ఇక రాజకీయపరంగానూ దెబ్బకొట్టేందుకు సొంత పార్టీలోనే అసంతృప్తులను రాజేసే ప్రయత్నాలను ప్రత్యర్థులు సైలెంట్‌గా చేపడుతున్నారన్న చర్చ నడుస్తోంది. మొన్నటి వరకు అధికార వైసిపికి ధీటుగా నిలబడేందుకు జెసి కుటుంబం ప్రయత్నిస్తూ వస్తోంది. చిన్న అంశం దొరికినా అధికార పార్టీ నేతలపై విరుచుకుపడుతూ వస్తున్నారు. దీనికి అధికారపార్టీ నుంచి కూడా గట్టి సమాధానలే ఎదుర్కోనాల్సి వస్తూ ఉంది. అనేక అవరోధాలు, ఆటంకాలు ఎదురైనా పురపాలక సంఘం ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ టిడిపి కైవసం చేసుకుంది. స్వల్ప మెజార్టీతోనే పురపాలక పీఠాన్ని దక్కించుకున్నప్పటికీ, తమ పార్టీ తరుపున గెలుపొందిన వారెవరూ జారిపోకుండా చూసుకోగలిగారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్‌గా జెసి.ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఛైర్మన్ అయినప్పటి నుంచి కూడా ఆ పార్టీ కౌన్సిలర్లతో పాలకవర్గాన్ని నడిపించే ప్రయత్నం చేశారు. మునిసపాల్టీలో ప్రొటోకాల్ విషయంలోనూ ఇటీవల నిరసన సాగింది. అయితే ఉన్నఫలంగా టిడిపి కౌన్సిలర్ రాబర్టు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడం కలకలం రేపుతోంది. ఆయన పదవికి రాజీనామా చేస్తే పాలకవర్గంలో టిడిపి బలం తగ్గే అవకాశం లేకపోలేదు. దీన్ని అవకాశంగా తీసుకుని అధికారపార్టీ అవిశ్వాసాన్న పెడితే ఏమి జరుగుతుందోనన్న చర్చ నడుస్తోంది. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగేళ్ల అవిశ్వాసం పెట్టేందుకు వీల్లేదన్న నిబంధన కొంత ఊరటనివ్వనుంది. అంతలోపు సార్వత్రిక ఎన్నికలు జరిగితే, తదనంతరం ప్రభుత్వం వచ్చాక చూసుకునే అవకాశం ఉంటుంది. త్వరలో సార్వత్రిక ఎన్నికలూ ఉన్నాయి. వాటికి సమయత్తమయ్యే పనిలోనూ జెసి కుటుంబముంది. ఈ క్రమంలో తాజాగా తాడిపత్రికి చెందిన అయూబ్ అనే మైనార్టీ నాయకుడు కూడా టిడిపికి రాజీనామా చేశారు. ఈయన జెసి ప్రబాకర్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం మరో చర్చనీయాంశమైంది. ఆయన వల్లనే పార్టీకి నష్టం జరుగుతోందంటూ రాజీనామా అనంతరం ఆరోపించారు. సొంత పార్టీ నుంచే వరుసగా మరో వ్యక్తి రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వరుసగా సొంత పార్టీలో చోటు చేసుకుంటున్న రాజీనామాల పర్వం వెనుక కారణాలేమై ఉన్నా అన్న సందేహాలను ఆ పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ప్రత్యర్థుల ప్రమేయమం ఏమైనా ఉందా లేక స్వయం తప్పిదాలా అన్న చర్చ నడుస్తోంది. అటు పదవికి, ఇటు రాజకీయంగానూ రెండింటి ఒకేసారి దెబ్బకొట్టేందుకు ప్రత్యర్థులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాన్ని వారి అనుయాయులు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా తాడిపత్రిలో జరుగుతున్న ఈ పరిణామాలు రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి.

ఎస్ఐల బదిలీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. బుక్కరాయసముద్రంలో పని చేస్తున్న పి.వెంకటేశ్వర్లును అనంతపురం వన్‌టౌన్, అనంతపురం టూటౌన్‌లో పని చేస్తున్న డి.శ్రీనివాసులును బుక్కరాయసముద్రానికి, అనంతపురం వన్‌టౌన్‌లో పని చేస్తున్న ఎస్.గౌస్‌బాషాను డీఎస్బీకి, అనంతపురం వన్ టౌన్ లో పని చేస్తున్న ఎ.తిప్పయ్యను విడపనకల్‌కి, వీఆర్‌లో ఉన్న ఎం.జావెద్ బాషా, ఆర్.రాఘవేంద్రరెడ్డిలను అనంతపురం టూటౌన్‌కి, అనంతపురం టూటౌన్‌లో పని చేస్తున్న ఎ.అల్లాబకాష్‌ను డీఎస్బీకి, అనంతపురం టూటౌన్‌లో పని చేస్తున్న కె.జయరాంనాయక్‌ను అనంతపురం ట్రాఫిక్‌కి, యాడికిలో పనిచేస్తున్న ఎ.గురుప్రసాదరెడ్డిని అనంతపురం త్రీ టౌన్‌కి, అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న బి.నబిరసూల్‌ను యాడికికి, వీఆర్‌లో ఉన్న ఎ.అంజాద్ బాషాను అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కి బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

భీమేశ్వర్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-అనంతపురం

వద్దిరెడ్డి భీమేశ్వరరెడ్డి

యాడికి మండలం కోనఉప్పలపాడుకు చెందిన రైతు వద్దిరెడ్డి రామనాథరెడ్డి కుమారుడు వద్దిరెడ్డి భీమేశ్వరరెడ్డికి బెల్గం విశ్వేశ్వరయ్య విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. ఆగస్టు 1న ఈయన ఆ యూనివర్సిటలో డాక్టరేట్ అందుకోనున్నారు. భీమేశ్వరెడ్డి బెంగళూరులోని ది ఆక్స్‌ఫర్డ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో కార్పొరేట్ రిలేషన్స్ హెడ్‌గా పని చేస్తున్నారు. విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ, బెల్గాం (కర్ణాటక)లో మేనేజ్మెంట్‌లో పరిశోధన చేసినందుకు గాను ఈయనకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మేనేజ్మెంట్ విభాగంలో ఆచార్యులు భాస్కరన్ పర్యవేక్షణలో "ఏ స్టడీ ఆన్ రిస్క్- రిటర్న్ అనాలిసిస్ ఆఫ్ సెలెక్టెడ్ ఈక్విటీ స్టాక్స్ లిస్టెడ్ ఇన్ బీయస్ఈ" అనే అంశంపై పరిశోధన చేశారు. తన పరిశోధన గ్రంథంలో ఆయన స్టాక్ మార్కెట్‌లోని పలు కంపెనీల స్టాక్ విలువల పెరుగుదల, తరుగుదలకు కారణాలను వివరించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టే వారికి ఎలాంటి కంపెనీలు ఎంచుకోవాలో పలు సూచనలు చేశారు. ఇందులో ముఖ్యంగా బ్యాంకులు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, సిమెంట్, స్టీల్, చమురు కంపెనీల స్టాక్ విలువల మీద పరిశోధన చేశారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

శాంతి ర్యాలీలో నేతల డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మణిపూర్ హింస, మారణహోమాన్ని నిర్మూలించి శాంతి నెలకొల్పడంలో భాగంగా అక్కడున్న బిజెపి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని యునైటెడ్ జేఏసీ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన మారణహోమాన్ని వ్యతిరేకిస్తూ యునైటెడ్ జేఏసీ ఆధ్వర్యంలో అనంతపురం ఆదివారం నాడు శాంతి ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి టవర్‌క్లాక్ సర్కిల్ వరకు శాంతి ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐ రాష్ట్ర నాయకులు డి.జగదీస్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అబ్దుల్ రసూల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాదాగాంధీ, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, మానవ హక్కుల వేదిక చంద్రశేఖర్, యునైటెడ్ జేఏసీ నాయకులు ముస్కిన్, బంగారు బాషా, ఏజీ.రాజమోహన్, వలి, ఐఎంఎం బాషా, సాకే హరి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన సంఘటన అమానవీయమైనదన్నారు. దేశ చరిత్రలో మునుపెన్నడూ జరగనంతగా మారణహోమం జరిగిందన్నారు. మణిపూర్ ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించి గిరిజనుల ప్రాణాలు కోల్పోవడానికి కారణం అయిందన్నారు. మతం చాటున జాతులను నిర్మూలించాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాన్ని ఎక్కడిక్కడ అడ్డుకోకపోతే రానున్న కాలంలో మారణహోమం దేశంలోని అన్ని ప్రాంతాల్లో చూడాల్సి వస్తుందన్నారు. దురదృష్టం కొద్దీ రాష్ట్ర రాజకీయాలు నడుపుతూ ఒకరిపై ఒకరూ భీకరంగా మాట్లాడుకుంటున్న టిడిపి, వైఎస్ఆర్‌సిపి, జనసేన పార్టీ నేతలు అవిస్వాస తీర్మాణానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని నిర్ణయించుకోవడం సిగ్గు చేటు అన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్ మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని బాధిత ప్రజలను అన్ని విధాలుగా సహాయ సహకారాలు, నష్టపరిహారం ఇచ్చి జీవనస్థితిగతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రజాతంత్ర వాదులుగా ఇలాంటి సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ నాగరాజు, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు జిలాన్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ పాల్గొన్నారు.

అనంతపరంలో శాంతిర్యాలీ నిర్వహిస్తున్న యునైటెడ్ జెఎసి నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని రాయలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-1996 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థులు ఆత్మీయత సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనంలో చిన్ననాటి మిత్రులు ఒకే వేదికపై కలుసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ, వారి క్షేమసంగతులు తెలుసుకున్నారు. అనంతరం వారికి విద్యాబోధన చేసిన గురువులను పూలహారాలు, శాలువాతో సన్మానించారు. సమాజంలో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న వారినీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ సుభాన్, శంకరయ్య, రమేష్, షెక్షావలి, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులపై నిర్లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ఛైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి

సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలి

ఏపీ విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ఛైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తక్షణం ఈ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులు అందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని ఏపీ విద్యుత్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఛైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్ సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏపీ విద్యుత్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ నాయకులు నబీరసూల్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ఛైర్మన్ పి.సుదర్శన్ రెడ్డితో పాటు కన్వీనర్ బి.రామలింగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారితో పాటు సిఐటియు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు నూర్‌మొహమ్మద్, రాజారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, సిఐటియు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, రాజేష్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ సంస్థ, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు పెంపుదల చేయడంలో జాప్యం చేస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. విద్యుత్ ఉద్యోగులు వేతనాలు ఎక్కువగా ఉంటున్నాయి, అందుకే సంస్థకు నష్టాలు వస్తున్నాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 15 శాతం మంది వేతనాలు పోల్చి మిగతా ఉద్యోగులందరికీ వేతనాలు ఎక్కువగా వస్తున్నాయని చూపడం సరికాదన్నారు. 24 గంటలు విధులు నిర్వహిస్తూ అనేక ప్రమాదాలకు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు గురవుతున్నారని తెలిపారు. శ్రమ చేసే కార్మికుల పోస్టులు పెంచి భర్తీ చేయాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్‌లను నియమించినా నేటికీ వారు సచివాలయ ఉద్యోగులా, విద్యుత్ శాఖ ఉద్యోగులా తేల్చని పరిస్థితి నెలకొందన్నారు. శ్రమ దోపిడీకి గురవుతున్న ఉద్యోగులు, కార్మికులకు వేతన సవరణ జరగాలన్నారు. అన్‌లిమిటెడ్ హెల్త్ స్కీం అమలు చేయాలన్నారు. కన్వీనర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్‌లు అందరినీ రెగ్యులరైజ్ చేసి విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలన్నారు. ఉద్యోగులందరికీ ఒకే మాస్టర్ స్కేల్ ఏర్పాటు చేయాలన్నారు. సిఐటియు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు నూర్ మహమ్మద్, రాజారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్లందరిని గౌరవప్రదంగా జీవించే విధంగా వేతనాలు రూపొందించి అమలు చేయాలన్నారు. ఈ సమస్యల అన్నింటిపై ఒక కార్యాచరణ రూపొందించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించామని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు రామచంద్ర, రమాదేవి, జిలానీ, సూరి, మధు, ఇబ్రహీం, చంద్ర, మీటర్ రీడింగ్ బిల్లింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు రమేష్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, మెడికల్ రెప్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ముత్తుజ ఇతర సంఘాల నాయకులు హాజరయ్యారు.

మైనార్టీల సదస్సులో ప్రసంగిస్తున్న శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్

టిడిపితోనే మైనార్టీల సంక్షేమాభివృద్ధి

మైనార్టీల సదస్సులో శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే సాధ్యమవుతుందని శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం టిడిపి అనంతపురం పార్లమెంట్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో మైనార్టీల సదస్సు నిర్వహించారు. టిడిపి మైనార్టీ సెల్ అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు సాలార్‌బాషా, రాష్ట్ర నాయకులు, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, అత్తార్ చాంద్‌బాషా, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ముస్తాక్ మౌలానా, ఏపీ నూర్‌బాషా సంఘం అధ్యక్షులు సుభహాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ, ఉపాధి, సామాజికంగా అభివృద్ధి చెందారంటే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పరిపాలనలో జరిగిందన్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్‌సిపి పరిపాలనలో పేరుకే మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవి అంజాద్‌బాషాకు ఇచ్చారని, నిధులు, విధులు చేపట్టలేని నిస్సహాయ స్థితిలో పని చేస్తున్నారని విమర్శించారు. పైగా రాష్ట్రంలో మైనార్టీలపై హత్యకాండ సాగుతోందన్నారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తులను కొల్లగొట్టేందుకు కుట్ర జరుగుతోందన్నారు. మత విద్వేషాలు చేస్తున్న బిజెపితో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లాలూచి పడి, తనపై ఉన్న కేసులకు భయపడి కేంద్రం తీసుకొచ్చిన అనేక బిల్లులకు మద్దతుగా నిలిచాడన్నారు. టిడిపి లౌకికతత్వం కలిగిన పార్టీ అన్నారు. విధాన పరంగా బిజెపిని వ్యతిరేకిస్తామన్నారు. రాష్ట్రం బాగుపడాలన్న, మైనార్టీలు అభివృద్ధి కావాలన్న టిడిపి అధికారంలోకి రావాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలు వేధింపులకు గురువుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితి పోవాలంటే టిడిపిని అధికారంలోకి తేవాలన్నారు. నూర్‌బాషా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్ మాట్లాడుతూ టిడిపి అధినేత, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు అసెంబ్లీని కౌరవ సభ నుంచి గౌరవ సభగా మార్చుతానని శపథం చేశారని, ఆ శపథం నెరవేర్చడానికి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, టిడిపి మహిళా విభాగం నాయకులు పర్వీన్, చమన్ భార్య, కుమారుడు రమీజా చమన్, డాక్టర్ ఉమర్ ముక్తార్, టిడిపి నాయకులు తాజుద్దీన్, శివబాల తదితరులు పాల్గొన్నారు.

రంజిత్ ఆశయాలు కొనసాగిస్తాం

వర్థంతి సభలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సేవాఘడ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రంజిత్ నాయక్ ఆశయాలు కొనసాగిస్తామని సేవాఘడ్ ట్రస్ట్ అధ్యక్షులు కొర్రా జగన్నాథరావు పేర్కొన్నారు. ఆదివారం గుత్తి మండలం సేవాఘడ్‌లో రంజిత్ నాయక్ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సేవాఘడ్ ట్రస్ అధ్యక్షులు జగన్నాథరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె.కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, కోశాధికారి పిఎల్.రవీంద్ర నాయక్, ఎఐబిఎస్ఎస్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి శంకర్‌జాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిలాల్ నాయక్, కర్నాటక ఎమ్మెల్సీ జలజాబాయి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్, తెలంగాణ సబావట్ రాజు నాయక్, గిరిజన బంజారా సమాఖ్య జాతీయ అధ్యక్షులు ఎస్‌కె.మహేష్ బంజారా తదితరులు మాజరై రంజిత్ నాయక్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారాల అభ్యున్నతికి, చైతన్యానికి, సామాజిక సమానత్వానికి రంజిత్ నాయక్ చేసిన సేవలు ఆదర్శనీయం అన్నారు. బంజారాలను ఏకతాటిపై తెచ్చిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. ప్రతి నిత్యం బంజారాల అభివృద్ధికి ఆయన శక్తివంచన లేకుండా కృషి చేశారని చెప్పారు. వారి ఆశయాలను కొనసాగించడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ నాయక్, ప్రధాన కార్యదర్శి చక్రే నాయక్, సాంస్కృతిక విభాగం కార్యదర్శి ఎస్‌కె.రామచంద్ర నాయక్, రాష్ట్ర నాయకులు రంగ్లా నాయక్, బాలు నాయక్, అన్ని జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌నాయక్ వర్థంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

'కడప ఉక్కు'కై నేడు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం బుక్కరాయసముద్రంలో ధర్నా వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నల్లప్ప మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో పాలకులు అనుసరిస్తున్న కుయుక్తులను ఆపాలని డిమాండ్ చేశారు. దీనిపై వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వ రంగంలోనే ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని కోరుతూ జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, చిన్నఆంజనేయులు, నాగేంద్ర, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

'కడప ఉక్కు'పై కేంద్రం వ్యాఖ్యలు విడ్డూరం

తాడిపత్రి : కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న హామీని బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కి, ఈ ప్రాంతం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అనువు కాదని చెప్పడం విడ్డూరంగా ఉందని సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. కడపలో ఉక్కు పరిశ్రమ కోసం ఈ నెల 31వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భం గా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాలో ప్రజాస్వామ్యవాదులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సెయిల్ సంస్థ ద్వారా అధ్యయనం చేస్తున్నామని ప్రకటించిన కేంద్రం ఇప్పుడు చేతులెత్తేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థకే సాధ్యం కానప్పుడు ప్రయివేట్ సంస్థ ఇక్కడ ఏరకంగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు 4 సార్లు శంకుస్థాపనలు జరిగాయని ఎద్దేవా చేశారు. ఉక్కు పరిశ్రమపై అధికార వైసిపి నోరు మెదపడం లేదని విమర్శించారు. పైగా ఆ పార్టీకి అవసరమైన మద్దతు అందిస్తూ ఉందని మండిపడ్డారు. ఎపికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోయినా, విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేస్తున్నా కేంద్రంలోని బిజెపిని జగన్ ప్రభుత్వం ప్రశించకపోవడం శోచనీయమన్నారు. టిడిపి, జనసేన పార్టీలు ఇదే రీతిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమాగౌడ్, రామాంజనేయులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, పట్టణ కార్యదర్శి రామ్మోహన్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి రవికుమార్, పట్టణ అధ్యక్షులు సురేంద్ర, పూసల సంఘం అధ్యక్షులు చంటి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో ధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

అనధికార నర్సరీలు.. నాణ్యత లేని మొక్కలు.!

కొరవడిన అధికారుల పర్యవేక్షణ.. నష్టాల్లో రైతులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో అనుమతులు, రిజిస్ట్రేషన్ లేని ప్రయివేట్ వ్యవసాయ నర్సరీలు నిర్వహిస్తూ నాణ్యతలేని మొక్కలను విక్రయిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అలాంటి నర్సరీలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో 40కి పైగా నర్సరీలు నిర్వహిస్తున్నారు. నర్సరీలు ప్రభుత్వ గుర్తింపు పొంది, రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చట్టాలు ఉన్నా వాటిని అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు పేర్కొంటు న్నారు. ప్రతి నర్సరీకీ రిజిస్ట్రేషన్, లైసెన్సు తప్పనిసరిగా ఉండాలి. అలాంటి వారు మాత్రమే హార్టికల్చర్ అధికారుల ఆదేశాల మేరకు విత్తనాలు కొనుగోలు చేసి ఆ మొక్కలనే రైతులకు అమ్మాలి. గుర్తింపు పొందిన నర్సరీల్లో రైతులు మొక్కలు కొనుగోలు చేసి నాటితే మొక్కల్లో సరైన ఎదుగుదల లేకపోయినా, పంట దిగుబడి రాకపోయినా, నష్టం వాటిల్లినా రైతులకు పంటల బీమా వర్తిస్తుంది. అయితే మండలంలో చాలా నర్సరీలు ప్రభుత్వ అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలో నిర్వహిస్తున్న నర్సరీల ప్రాథమిక సమాచారాన్ని సైతం అధికారులు, ఆర్‌బికె సిబ్బంది గుర్తించలేదని రైతులు పేర్కొంటున్నారు. మిరప, టమోటా రైతులు అధిక ధర పెట్టి మొక్కను కొనుగోలు చేయగా మొక్కలు సరిగా ఎదగకపోవడం, పంట దిగుబడి రాకపోవడం, తదితర కారణాలతో నష్టపోతున్నారు. ఇకనైనా అధికారులు నర్సరీలపై నిఘా ఉంచి రైతులకు నాణ్యమైన మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మినరల్ వాటర్ క్యాన్లతో వస్తున్న ఆటో పట్టణంలోని ఆర్‌ఆర్ హోటల్ ఎదురుగా యూటర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో అద్దం ధ్వంసమై డ్రైవర్ రాజేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని 108 వాహనం ద్వారా ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బైక్ నుంచి పడి మహిళకు గాయాలు

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని పత్తికొండ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడింది. కర్నూలు జిల్లా ఆస్పరి మండలానికి చెందిన లక్ష్మీదేవి భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై గుత్తికి వస్తుండగా రైల్వే వంతెన సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద కింద పడడంతో గాయాలయ్యాయి. వెంటనే ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాయదుర్గంలో చోరీ

రాయదుర్గం : పట్టణంలోని సిద్దేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న రమేష్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి ఉండగా దొంగలు తలుపు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉంచిన 2 తులాల బంగారు ఆభరణం, రూ. 15 వేల నగదు దోచుకెళ్లినట్లు ఇంటి యజమాని తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

పేరూరు రిజర్వాయర్‌కు నీరందించే రెండవ లిఫ్ట్ దగ్గర ఆగిపోయిన పనులను పరిశీలిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్, టిడిపి నాయకులు

పేదల సొంతింటి కల నెరవేర్చలేని అసమర్థ ప్రభుత్వం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

అధికారం చేపట్టి నాలుగేళ్లయినా పేదల సొంతింటి కల సాకారం చేయలేని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అనంతపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిసి వరుణ్ విమర్శించారు. జనసేన ఆధ్వర్యంలో ఆదివారం రాప్తాడు నియోజకవర్గంలోని కురుగుంట గ్రామం వద్ద ఉన్న జగనన్న కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ నివాసానికి ఏమాత్రం ఆమోదయోగ్యం కానీ చోట పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని మండిపడ్డారు. పేదలకు లక్షలాది గృహాలు నిర్మిస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ ఎన్ని ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు వారి కార్యకర్తలకు అక్కడక్కడ లబ్ధి చేకూర్చడం తప్పితే సామాన్యులను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల సొంతింటి కల సాకారం కావాలన్నా, రాజకీయ పార్టీలకు అతీతంగా పేదలకు మంచి జరగాలన్నా పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలన్నారు. కావున ప్రజలు జనసేన పార్టీని ఆదరించి రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాప్తాడు ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, జయమ్మ, అవుకు విజయకుమార్, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర కార్యదర్శులు విశ్వనాథ్, అంజి, వడ్డే వెంకటేష్, నగర సంయుక్త కార్యదర్శి ఆకుల అశోక్, సంతోష్, విశ్వనాథ్, దాసరి సరిత, తదితరులు పాల్గొన్నారు.

కురుగుంట జగనన్న కాలనీలో పర్యటిస్తున్న వరుణ్, నాయకులు

సంఘ సమావేశంలో పాల్గొన్న వడ్డెర్లు

వడ్డెర్ల సంక్షేమం పట్టని ప్రభుత్వం

రాష్ట్ర వడ్డెర ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ల మురళీ

ప్రజాశక్తి-గుంతకల్లు

వైసిపి ప్రభుత్వం వడ్డెర్ల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని రాష్ట్ర వడ్డెర ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ల మురళీ, జిల్లా ఉపాధ్యక్షుడు వి.ఎం.మునిస్వామి విమర్శించారు. పట్టణంలోని పాత గుంతకల్లు లోని అంకాలమ్మ గుడి ఆవరణలో ఆదివారం వడ్డెర్ల సంఘ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా దేవళ్ల మురళీ హాజరై మాట్లా డారు. టిడిపి ప్రభుత్వం వడ్డెర్ల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 132 కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చేందుకు జీఓ కూడా జారీ చేసిందన్నారు. జగన్ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో వడ్డెర్ల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వడ్డెర్ల సంక్షేమానికి కృషి చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లను చైతన్య పరచి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావే శంలో ఆ సంఘం అధికార ప్రతినిధి మధు రాజు, గంప పెద్దన్న, గుంతకల్లు సంఘం అధ్యక్షుడు వి.ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు వి.తిమ్మప్ప, వి.ఎం.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులకు పట్టిన గ్రహణం సిఎం జగన్

మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాయలసీమ ప్రాజెక్టులకు సిఎం జగన్ గ్రహణంలా పట్టుకున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. ఇక జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో నాలుగేళ్ల పాలనలో వైసిపి పాలనలో ఏం పురోగతి సాధించారని ప్రశ్నిస్తే ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి హరికథ చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆమె పరిటాల శ్రీరామ్‌తో కలిసి మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా ఆత్మకూరు సమీపంలోని సింగనగుట్ట దగ్గర టిడిపి హయాంలో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు రిజర్వాయర్‌కు నీరందించే కాలువ రెండవ లిఫ్ట్ దగ్గర ఆగిపోయిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి హయాంలో పనులు కేటాయించడమే కాకుండా భూసేకరణను చాలా వరకూ పూర్తి చేశామని, అలాగే కొందరు రైతులకు పరిహారం కూడా చెల్లించామన్నారు. ఇంకా చాలామందికి పరిహారం చెల్లించాల్సి ఉందని ఆ రైతులు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం వారు పంట పెట్టుకునే పరిస్థితి కూడా లేదన్నారు. వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించి ఉంటే ఈపాటికి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు పూర్తయ్యేవని, తద్వారా వేలాది ఎకరాలు సాగులోకి వచ్చేవన్నారు. కానీ వాటికి ఏమాత్రం నిధులు కేటాయించకుండా కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామంటూ నాలుగేళ్లుగా చెబుతున్నారే కానీ ఒక్క ఎకరానికీ నీరిచ్చింది లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేయడానికే చంద్రబాబు వస్తున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట మండల టిడిపి నాయకులు ఉన్నారు.

ప్రయివేటీకరణ విధానాలపై పోరాడాలి

ఐఎఫ్‌టియు ఆలిండియా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్

ప్రజాశక్తి-గుంతకల్లు

బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందని, దానికి వ్యతిరేకంగా కార్మిక లోకం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టియు ఆలిండియా జనరల్ సెక్రటరీ టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గుంతకల్లులో రెండు రోజులుగా జరిగిన ఐఎఫ్‌టియు రాష్ట్ర వర్క్‌షాప్, రాజకీయ తరగతులకు ఆదివారం టి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో టి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తమ శ్రమ శక్తి మీద ఆధారపడి నిర్మాణం చేసుకున్న ప్రభుత్వ రంగంలోని పోస్టల్, టెలికాం, బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, తదితర రంగాలకు చెందిన లక్షల కోట్ల ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్లకు అప్పగిస్తుందని ఆరోపించారు. అలాగే కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్లకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లు గా మార్చిందన్నారు. ఈ విధానాలు కార్మిక వర్గానికి గుదిబండగా మారబోతున్నాయన్నారు. మరోపక్క సామరస్యంగా జీవిస్తున్న ప్రజల మధ్య మత చిచ్చు రగిలించి, మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తుందని, దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికులు, ప్రజల మధ్య సమైక్యత తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రాధాన్యతా రంగాలను ఎంచుకొని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జె.వెంకటేశ్వర్లు, ఆర్.హరికృష్ణ, కార్యదర్శులు యు.వెంకటేశ్వరరావు, జి.భారతి, కోశాధికారి కె.వి.రమణ తదితరులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించి "కార్మిక వర్గానికి పిలుపు" అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు చర్చలో పాల్గొన్నారు. భవన నిర్మాణ రంగం, హమాలీ, మోటార్, అంగన్వాడీ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ రంగాలపై అధ్యయనం, రాజకీయ అవగాహన పెంపొందించుట, నిర్మాణం, కమిటీల ఫంక్షన్, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బి.సురేష్, పట్టణ నాయకులు చిన్నా, ఎం.యేసు, రామాంజి, సత్తార్, జిలాన్‌బాషా, హనుమంతు, ఆశాబీ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు ఆలిండియా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్

గుత్తి పట్టణంలోని గాంధీ చౌక్‌లో నిరసన తెలుపుతున్న క్రైస్తవ సమాఖ్య సభ్యులు

మహిళలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-గుత్తి

దేశంలో మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను ప్రభుత్వాలు అరికట్టాలని బైబిల్ మిషన్ ప్రార్థన శాల ఫాస్టర్ రెవ.అద్భుతకుమార్ కోరారు. దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని కోరుతూ ఆదివారం గుత్తి మండల క్రైస్తవుల సమాఖ్య ఆధ్వర్యంలో గుత్తి ఆర్ఎస్‌లోని సిఎస్ఐ చర్చి నుంచి పట్టణంలోని సిఎస్ఐ చర్చి మీదుగా గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్లు దేశంలో శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అద్భుతకుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను ప్రభుత్వాలు అరికట్టి ప్రజలను రక్షించాలన్నా రు. అలాగే వెంటనే మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో సిఎస్ఐ రాయలసీమ డయాస్ డివిజన్ అధ్యక్షులు డేవిడ్‌నాయక్, గుత్తి మండల క్రైస్తవుల సమాఖ్య నాయకులు, ఫాస్టర్లు వాసు, పాల్, శ్రీనివాసులు, వైపి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శిగా రేగాటి శివకృష్ణ

ప్రజాశక్తి-ఉరవకొండ

రేగాటి శివకృష్ణ

కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన ఎన్ఎస్‌యుఐ(విద్యార్థి విభాగం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా ఉరవకొండ మండల పరిధిలోని రాయంపల్లి గ్రామానికి చెందిన రేగాటి శివకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర బాధ్యతలను అప్పగించిన పార్టీ పెద్దలు, ఎన్ఎస్‌యుఐ జాతీయ, రాష్ట్ర నాయకులు, ఎపిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సాకే శైలజనాథ్, డిసిసి అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో 2024లో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అధికారంలోకి వస్తే ఎపికి ప్రత్యేకహోదాతో పాటు ఆరు సూత్రాల కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తూ స్థానిక నాయకుల సహాయ సహకారాలు తీసుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఘనంగా మొహరం వేడుకలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మొహరం వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం పట్టణ వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య పీర్లను ఊరేగించారు. సాయంత్రం 5 గంటలకు వివిధ చావిడిల నుంచి పీర్లను జలధి కార్యక్రమానికి తరలించారు. ఈ దృశ్యాలను చూడటానికి పట్టణంలోని ప్రజలు గాంధీచౌక్, మేడా వీధి, టీ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్‌కు పెద్దఎత్తున తరలివచ్చారు.

కళ్యాణదుర్గంలో జలధికి తరలి వెళ్తున్న పీర్లు

నేడు కుళ్లాయి స్వామి చివరి దర్శనం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో పది రోజులుగా వైభవంగా జరిగిన కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం(నేడు) రాత్రి కుళ్లాయిస్వామి చివరి దర్శనంతో ముగుస్తాయని ఆలయ కార్య నిర్వహణ అధికారి శోభ, ముజావర్ హుసేన్‌ప్ప తెలిపారు. చివరి దర్శనంలో కుళ్లాయిస్వామి పీరులో వెంకటేశ్వరస్వామి నామాలు కనిపిస్తాయని, అందుచేతనే భక్తులు కుళ్లాయిస్వామి గోవిందా గోవిందా అని నినాదాలు చేస్తారని ప్రతీతి.

ఇరువర్గాల ఘర్షణ.. పలువురికి గాయాలు

మొహరం వేడుకల్లో భాగంగా కళ్యాణదుర్గం పట్టణంలో ఆదివారం సాయంత్రం పీర్లు జలధికి బయల్దేరాయి. ఈ ఊరేగింపులో పట్టణానికి చెందిన సౌభాగ్య థియేటర్ కాలనీ వాసులు, ఎస్టీ కాలనీ వాసులు ఘర్షణ పడడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ శ్రీనివాసులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి సమస్యను పరిష్కరించారు. అలాగే ఆకతాయిలను అక్కడి నుంచి తరిమేశారు.

జలధికి తరలిన పీర్లు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఆదివారం పీర్లు జలధికి తరలివెళ్లాయి. ముచ్చుకోట, కుమ్మెత నర్సాపురం, పెద్దఎక్కలూరు, తిమ్మంచెరువు, తదితర గ్రామాల్లో అగ్నిగుండ ప్రవేశం అనంతరం తప్పెట్ల నడుమ గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. అగ్ని గుండ ప్రవేశం చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. భక్తులు చక్కెర, టెంకాయలు, వంటివి సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ ఖాజాహుస్సేన్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమస్యాత్మక గ్రామమైన పెద్దఎక్కలూరులో స్వయంగా పర్యటించి సమస్యలు తలెత్తకుండా జలధి కార్యక్రమాన్ని పూర్తి చేయించారు.

బెళుగుప్ప : మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొహరం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బెళుగుప్పలో సాయంత్రం పీర్లను పురవీధుల గుండా అట్టహాసంగా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని సూర బెల్లం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం పీర్లను జలధికి తీసుకెళ్లారు. ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రామకృష్ణయ్య, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుట్లూరు : మండలంలో వారం రోజుల నుంచి మొహరం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్వాహకులు పల్లి, మడ్డిపల్లి, నారాయణరెడ్డిపల్లి, కడవకల్లు, తదితర గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామునే పీర్లను ఊరం తా ఊరేగించారు. తెల్లవారిన తర్వాత అగ్నిగుండ ప్రవేశం చేయించారు. సాయంత్రం పీర్లను ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లడంతో వేడుకలను ముగించారు.

పెద్దపప్పూరులో పీర్ల ఊరేగింపు

పుట్లూరులో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లు

వాలంటీర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

వాలంటీర్ కుటుంబానికి అండగా ఉంటాం : వైసిపి

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండల పరిధిలోని పిసిపి కొత్తకోట గ్రామానికి చెందిన వాలంటీర్ బెస్త లింగమూర్తి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వైసిపి నాయకులు తెలిపారు. లింగమూర్తి శనివారం రాత్రి ఉరవకొండ నుంచి స్వగ్రామం వెళ్తూ మార్గమధ్యలో ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొని అక్కడికక్కడే మరణించిన విషయం తెలిసిందే. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి సూచన మేరకు వైసిపి నాయకులు ఆదివారం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో లింగమూర్తి మృతదేహాన్ని సందర్శించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, వజ్రకరూరు జెసిఎస్ మండల కన్వీనర్ రాచనగౌడ్, ఎంఎల్ఓ తేజేశ్వర్‌రెడ్డి, సర్పంచి శివాజీనాయక్, తిప్పయ్య, బసవరాజు, పెద్దిరెడ్డి, వీరాంజి, అర్జున్, చంద్రనాయక్, మాబు సాబ్, రమేష్, తదితరులు ఉన్నారు.

కాలం చెల్లిన బస్సులతో అవస్థలు

హిందూపురం : హిందూపురం ఆర్‌టిసి డిపో పరిధిలో కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున పాల సముద్రం సమీపంలో బస్సు వస్తున్న సమయంలో ఐటెక్ బస్సు కిటికి అద్దాలు ఒక్క సారిగా పగలడంతో కిటికి పక్కన కుర్చోన్న ప్రయాణికుడి గాయాలు అయ్యాయి. ఆ సమయంలో అ వ్యక్తి జర్కిన్ ధరించడంతో చెయ్యికి గాజు ముక్కలు తగిలి చిన్న దెబ్బలు తలిలాయి. తిరుపతి నుంచి హిందూపురం వస్తున్న ఐ టెక్ బస్సులో ప్రయాణికుడిపై బస్సు కిటికీ అద్దాలు పగిలి పడ్డాయి. ఆ సమయంలో ప్రయాణికుడు జర్కిన్ వేసుకొని ఉండడంతో తలకు ఇతర శరీర భాగాలకు ప్రమాదం తప్పింది. చేతులకు గాజు ముక్కలు గుచ్చుకొని స్వల్ప గాయాలయ్యాయి. కాలం చెల్లిన బస్సులనే నడుపుతూ అందులోనూ హైటెక్ సర్వీస్ ఛార్జీలను వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలంటే ప్రజలు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామానికి చెందిన చాకలి గంగన్న వద్ధాప్యంతో మృతి చెందగా అంత్య క్రియల ఖర్చుల కోసం ఆదివారం టిడిపి నాయకులు సంగప్ప రూ. 3 వేలు అందజేసినట్లు గంగన్న కుమారుడు చంద్ర తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నవీన్, సైకిల్ షాపు హనుమంతు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE GOOTY
E.P. No. 31/2021 In O.S. No. 46/2016

Between:
Dudhektila MastIon Bee **...Petitioner-D.Hr.**
AND
Kandhukuri Ramakrishna Reddy
...Respondent-J.Dr.

వేలం ప్రకటన

పై అర్జీదారుడు తనకు ప్రతివాది నుండి రావలసిన డిక్రీ మొత్తము మరియు ఖర్చులకు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని వేలం వేసి తనకు రావలసిన ఇ.పి మొత్తము మరియు ఖర్చులను ఇప్పించవలయునని కోర్టు వారిని కోరినందున సదరు కోర్టు వారు షెడ్యూలు ఆస్తిని 18/08/2023 వ తేదిన పగలు 10:00 గంటలకు బహిరంగంగా వేలం వేయుదురనియు మరియు ఎవరైనను వేలంలో పాల్గొను వారు కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొని షెడ్యూలు దాఖలు ఆస్తిని వేలంలో కొనవచ్చునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

SCHEDULE

Item No.1 Landed property with full extent with sub-division as specified below situate within the R.D. of Ananthapuranni and S.R.D. of Tadipatri and forming part of Cherlopalli Allege fields and Maddipalli village.

SI.No. Survey	No. Extent A.C.	Value of plaintiff per acre	
1. 334-C	0.60 cents	Rs.2,00,000/. per acre	Rs.1,20,000/-
2. 335-	A 0.37 cents	Rs.2,00,000/- per acre	Rs.74,000/-
3.884-A	0.80 cents	Rs.2,00,000/-per acre	Rs.1,60,000/-

Total A. 1.77 cents pykl hallshare = Rs. 3,54,000/.

Item No.2 Landed property with full extent with sub-division as specified below situate within the R.D. of Ananthapurano and S.R.D. of Tadipatri and forming part of Cherlopalli village fields and Maddipalli

SI.No. Survey No,.	Extent A.C.	Value of plaintiff per acre	
1. 235-C	A 1.94 cents	Rs.2,00,000/- per acre	Rs.3,88,000/-
2. 882-B	0.58 cents	Rs.3,00,000/. per acre	Rs.1,74,000/-
3. 883-A	0.81 cents	Rs.3,00,000/- per acre	Rs.2,43,000/-
4. 883-B	0.58 cents	Rs.3,00,000/. per acre	Rs.1,74,000/-
5. 884-B	0.95 cents	Rs.3,00,000/- per acre	Rs.2,85,000/-
		Rs. 12,64,000/-	

D.Hr value for 2 items Rs.8,30,000/-
Amin Value Rs.8,00,000/-
Sub Reg Value Rs.861,900/-

V. Munaiah, R.V. Chalapathi Advocates for the Petitioner - D.Hr.